కథానిక

# ప్రేమకి వయస్సు లేదు

## శారదా అశోకవర్ధన్


**కాల్ బెల్ మోగగానే వెళ్లి తలుపుతీసింది సౌందర్యలహరి. పోస్టుమాన్ నాలుగు కవర్లూ, ఒక కార్డూ, ఒక పత్రిక, చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.**

అన్నీ కూడా స్వర గంధర్వ మోహన మురళీగారివే! బరంపురంలో కచ్చేరీకి రమ్మని ఒకరు, విశాఖలో కచ్చేరీకి రమ్మని కొందరూ, హైద్రాబాదులో జరిగిన సన్మానాన్ని గురించి రాసిన పేపరు పంపించిన వాళ్లొకరు మొత్తానికన్నీ అతనికే! అయితే అఖరు కవరు, గులాబీరంగులో వుంది. చక్కటి గుండ్రటి అక్షరాలతో 'శ్రీమతి సౌందర్యలహరిగారికి' అని వుంది. ''అటువంటి రంగు కవర్లో తనకెప్పుడూ ఏ ఉత్తరమూ రాలేదు. పైగా అదెంతో కుదించి శ్రద్ధగా రాసినట్టుంది. అంత మంచి దస్తూరి తనకి తెలిసినంతవరకూ ఎవరికీ లేదు.'' తనలో తనే అనుకుంటూ మిగిలిన కవర్లన్నీ ఒకచోట పెట్టి, ఆకవరు జాగ్రత్తగా చింపింది. గుండె దడ దడలాడింది. కళ్లు పెద్దవిచేసి ఒంటిమీది రోమాలు మేకుల్లా నుంచుంటుంటే, చదవడం మొదలెట్టింది.

'నాకు అత్యంత ప్రియమైన సౌందర్య లహరి గారూ!

ఆశ్చర్యపోతున్నారా అలా సంభోదిస్తున్నందుకు? నేనెవరో మీకు తెలీదు. కానీ మీరు నాకు బాగా తెలుసు! నా ఆరాధ్య దేవత! నా ప్రేమమయి! నా స్వప్న సుందరి!'

ఈ వాక్యాలు పదే పదే చదివింది. చదువుతూన్నంతసేపూ కోపం ముంచుకొచ్చింది. కానీ ఆ గులాబీ రంగు కాగితాల మీద నల్లని పూసల్లాంటి దస్తూరి, మళ్లీ మళ్లీ చూడాలనిపించింది. ఏదో దడ! ఏదో భయం! అది ప్రేమలేఖలా వుంది. 'లా', ఏమిటి ప్రేమలేఖే! ఈ వయస్సులో! అదే ఆశ్చర్యం! సంక్రాంతి పండగకి వస్తున్నామని కూతుళ్లు అవనిజ, ఆమనీ రాశారా లేకపోతే విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.బి.ఏ. చేస్తూన్న ఆశ్రిత్ రాశాడా, అని చెప్పి ఆత్రుతగా ఉత్తరం చింపితే, ఈ వయస్సులో ఈ ప్రేమలేఖేమిటి? తను అత్తగా కాదు అమ్మమ్మ కూడా అయింది. మనమరాళ్లు సుచిత్ర. బబిత, మనవడు అనఘ తనతో అమ్మమ్మా అని ఆటలాడే వయస్సులో తనకి ఎవరో ప్రేమలేఖ రాయడం, ఎంత హాస్యాస్పదం! కూతుళ్లకీ అల్లుళ్ళకీ తెలిస్తే ఏమనుకుంటారు? ఒళ్లు



జలదరించింది సౌందర్యకి. ఉత్తరం సాంతం చదవకుండా చింపాలనిపించలేదు. అందుకే భయపడుతూనే మళ్లీ చదవడం మొదలెట్టింది.

'నా ఊహలకు రూపకల్పనగా రూపుదిద్దుకున్న ఊహా! నా మనస్సును దోచుకున్న మానసచోరిణీ, నీకివే నా పెదవులపై విరబూసిన నంది వర్ధనం లాంటి కమ్మని ముద్దులు. నవ్వుతున్నావుకదూ! నీ పెదవులపై విరిసిన చిరునవ్వుల మందారాలు, బుగ్గల్లో చొరబడి, ఎఱ్ఱని సూర్య బింబంలా వున్నాయి. నాకెలా తెలుసని అనుకుంటున్నావా? నీ ప్రతి అడుగూ ప్రతినిత్యం నేను పరిశీలిస్తూనే వున్నాను, ఎన్నో ఏళ్లుగా! అయితే ఏనాడూ ఇలా రాసి ప్రకటించుకోలేదు. నా కలల రాణీ! నేనెవరినోననీ ఏ దుర్మార్గుడినోననీ ఈ ఉత్తరాన్ని చింపిపారెయ్యకు! నీ కుటుంబానికీ నీకూ మచ్చ తెచ్చే పని నేను ఏనాడూ చెయ్యను. ఎన్నో ఏళ్లుగా నిన్ను చూస్తూ, నిన్నే ఆరాధిస్తూ ఒణికిన నేను నీకు అప్రతిష్ఠ తేగలనా! నన్ను నమ్ము. జీవితంలో నీకీమాటలు చెప్పి తనివితీరా ఆనందించాలనీ, ఒక రకమైన 'థ్రిల్' అంటే అనుకోని ఆశ్చర్యాన్నీ సంతోషాన్నీ పొందాలనీ, ధైర్యం చేసి ఈ ఉత్తరం రాశాను. దీన్ని నువ్వు చింపేస్తే, నా గుండె ముక్కలు ముక్కలుగా బద్దలైపోతుంది. ప్లీజ్! నువ్వు నూరేళ్లు నిండుగా నవ్వుతూ బతకాలి! అదే నా ఆకాంక్ష! నిన్ను చూస్తూ నేను నీ ఊహల్లో జీవించాలి! అంతే!... అంతేనా కోరిక!

ఉంటామరి

నిన్ను ప్రతి క్షణం ఆరాధించే ప్రియుడు

నీకోసమే జీవిస్తూన్న ప్రేమ పిపాసి నీ ప్రేమ తపస్వి! ఉత్తరం పూర్తిగా ఎన్నిసార్లు చదివిందో తనకే తెలీదు. చింపేద్దామనుకుంది. మనసు రాలేదు. ఉత్తరంలోని అతని ప్రతీ మాటా పదే పదే గుర్తుకొస్తోంది. కానీ ఈ ఉత్తరాన్ని ఎవరైనా చూస్తే. సాగర్‌కి తెలిస్తే? ఈ వయస్సులో... నలుగురూ నవ్విపోతారు. అందరూ గేలి చేస్తారు. అల్లుళ్లూ కూతుళ్లూ,

కొడుకూ అసహ్యించుకుంటారూ... మనవలూ, మనవరాళ్లూ... ఛీ... ఛీ! ఆయన నన్నూ, నా శీలాన్నీ అనుమానిస్తారు. ఒక పాపిలాగా భావిస్తారు. ఉత్తరం చించెయ్యబోయింది. కానీ, మనసు ఒప్పుకోలేదు. ఈ ఉత్తరం చించేస్తే నా గుండె ముక్కలు ముక్కలుగా బద్దలవుతుంది. ఉత్తరంలోని ఆ ప్రేమ తపస్వి మాటలు జ్ఞాపకం వస్తున్నాయి. ఆమె పిచ్చిదానిలా అయిపోతోంది. తనేమిటో, తనేం కోరుకుంటుందో తనకే అర్థం కావడంలేదు.

తనకీ సాగర్‌కీ పెళ్లయి నలభై ఏళ్లు



దాటాయి. సాగర్ వల్ల తనకేనాడూ ఎలాంటి కష్టమూ కలగలేదు. తనంటే వల్లమాలిన ప్రేమ. బంగారం లాంటి భర్తా, రత్నాల్లాంటి పిల్లలూ, వజ్రాల్లాంటి మనవలూ, ఇల్లూ వాకిలీ, ఐశ్వర్యం, ఆనందం, అన్నీ తనకున్నాయి. వీడెవడో పిచ్చి పిచ్చి మాటలతో ఉత్తరం రాస్తే నేనెందుకు దాన్ని దాచుకోవాలి? ఒళ్లు మండిపోయింది సౌందర్యకి. ఆ ఉత్తరాన్ని సాగర్‌కి చూపించాలనుకుంది. కానీ, ఏమో ఈ మగజాతి! ఎన్నాళ్లనుంచి ఈ వ్యవహారం సాగుతోందనో, ఎటువంటి సంబంధం వుందనో అనుమానిస్తే? తనగతి అధోగతికదూ?'' ఆలోచించి ఆ ప్రయత్నం మానుకుంది.

ఉత్తరాన్ని చింపకుండా ఇంకోసారి ఇలాంటి ఉత్తరాలు రాయొద్దని చెప్పాలని అడ్రసు కవరు మీద ఉండడంవల్ల, తెల్లవారు ఝామున సాగర్ నిద్రపోతూన్నప్పుడు సమాధానం రాసెయ్యొచ్చని మడిచిపెట్టి, తన అలమారలో పట్టుచీరల కింద మడిచి పెట్టింది.

అంతలోనే కాల్‌బెల్ మోగింది. అదిరిపడి వెళ్లి తలుపు తీసింది. సాగర్! అతణ్ని చూడగానే ఏదో తప్పు చేసిన దానిలా భయపడింది సౌందర్య! సాగర్ నవ్వుతూ లోపలికొచ్చాడు. ''లహరీ! ఏమిటలా వున్నావ్?'' అడిగాడు. అతనికి మరీ ప్రేమ కలిగినప్పుడు సౌందర్యా అనకుండా 'లహరీ' అని పిలుస్తాడు. అతనలా పిలుస్తే ఒళ్లు మరిచిపోతుంది సౌందర్య! ఆ తన్మయత్వంలో స్వర్గలోకాన్ని దర్శిస్తుంది సౌందర్య. కానీ, ఈరోజు అతని పిలుపు తనని కదిలించలేదు. కారణం తనలోని భయం. నిజం చెప్పలేని పిరికితనం! ఆందోళన, మనస్సు వికలమైపోయింది.

''లహరీ! చిరునవ్వుల నీ మోము చిన్నబోయిందెందుకు?'' అన్నాడు.

''అబ్బే! ఏం లేదు.'' అంది తడబడుతూ.

''ఏం లేదేమిటి? ఏదో వుందని నీ మొహంలో కొట్టొచ్చినట్టు కనబడుతూ వుంటే?''

భయంతో బెదురుచూపులు చ మూగిలా వుండిపోయింది.

''నగుమోము... గనలేని... నా జాలి...'' పాడాడు స్వరగంధర్వ మోహన మురళి. అతని పూర్తి పేరు మోహన మురళీసాగర్. ఇంట్లో అందరూ సాగర్ అనీ, సంగీత సామ్రాజ్యంలో అందరూ మోహన మురళీగారనీ పిలుస్తూంటారు. దగ్గర వాళ్లకి తప్ప సాగర్ పేరు ఎవరికీ తెలీదు.

నవ్వేసింది అతనలా పాడుతూంటే సౌందర్య!

''ఆ!... అదీ!... సొగసు చూడతరమా...'' మరోపాట...

''చాల్లెద్దురూ! ఇవిగో ఈ ఉత్తరాలు చూడండి'' అంటూ అతనికొచ్చిన ఉత్తరాలను చేతికందించింది సౌందర్య.

ఉత్తరాలందుకుని చదువుకున్నారు మోహనమురళీ స్వరగంధర్వ.

వర్షిస్తువుంటే ఆమెనే తదేకంగా చూస్తున్నారు సాగర్ ఉరఫ్ మోహనమురళి.

''ఏమిటలా చూస్తున్నారు?'' అడిగింది సౌందర్య.

''నా సౌందర్య లహరిని! వయస్సు పెరుగుతూన్నకొద్దీ నీలో కొత్త అందాలు కనిపిస్తున్నయ్'' చిలిపిగా అన్నారు.

అతనలా పొగుడుతూ వుంటే అది వరకు తను ఎంతో మురిసిపోయేది. అతనిలో తను ఐక్యమయిపోయినట్టనిపించేది. కానీ, ఈ రోజున వారిద్దరి మధ్య ఎవరో ఒక అజ్ఞాత వ్యక్తి వున్నాడనే భావన, ఆమెకి సంపూర్ణ ఆనందాన్ని కలిగించలేదు. ఆ అజ్ఞాత వ్యక్తిని మనసులోనే తిట్టుకుంటూ నిద్రలోకి జారిపోయింది ఆ రాత్రి సౌందర్య!

కళ్లు తెరిచేసరికి గడియారం నాలుగు గంటలు చూపించింది. సాగర్ గాఢనిద్రలో వున్నాడు. మెల్లగా లేచి చప్పుడు కాకుండా అలమారా తెరిచింది. పట్టుచీరల నడుమ వున్న పింక్ కవర్‌ని తీసింది. టేబుల్‌మీద వున్న కాగితం కలం తీసి, రాయడం మొదలెట్టింది.

''ప్రేమ తపస్విగారూ!

మీకు నమస్కారం. నా వయస్సు యాభైఏళ్లు! మీరు నన్ను చాలా ఏళ్లనుంచి ఆరాధిస్తున్నారంటే మీకు అంతే లేదా కొంచెం ఎక్కువ తక్కువగా అంతే వయస్సు అనుకుంటున్నాను. ఎంత ఆరాధనైనా, అభిమానమైనా, ఈ వయస్సులో ఇలాంటి లేఖలు రాయొచ్చా? పైగా స్వప్న సుందరీ, ఊహాసుందరీ అంటూ రాయొచ్చా? నాకు పెళ్లి కాకుండా వుంటే వయస్సుతో ప్రమేయం లేకుండా రాసినా ఫరవాలేదేమో కానీ, బంగారంలాంటి భర్తా, రత్నాల్లాంటి బిడ్డలూ, వజ్రాల్లాంటి మనవలూ మనమరాళ్లూ వున్న నాకు ఇలాంటి ఉత్తరం రాయడం, నా కాపురంలో కలతలు తేవాలన్న దురుద్దేశమే కదూ? నా భర్త గొప్ప సంగీత విద్వాంసుడు స్వరగంధర్వ శ్రీశ్రీ మోహనమురళీ గారు! నన్ను అభిమానించి, ఆనందింపజేసే ఆదర్శమూర్తి! శ్రీరామచంద్రుడిలా ఏకపత్నీవ్రతుడు! మేమిద్దరం చిలకా గోరింకల్లా నలభైఏళ్ల కాపురం చేశాం! నాకు అతనూ, అతనికి నేనూ తప్ప మా మధ్య మరెవ్వరికీ చోటు లేదు. దయచేసి మరోసారి ఇలాంటి ఉత్తరాలు రాయకండి ప్రేమ తపస్విగారూ!'' అంటూ రాసి సాగర్ టేబిల్ డ్రాయర్‌లో వున్న కవరు తీసి ఉత్తరాన్ని పెట్టి అంటించి, రెడిగా వున్న స్టాంపులు కూడా అంటించి, మళ్లీవచ్చిపడుకుంది కవరుని తెల్లారాక, పనిమనిషికిచ్చి పోస్టు చెయ్యమందామని అలమారాలో పెట్టి దాంతోపాటు తరవాత చించేద్దాంలేనని పింక్ కవర్‌ని కూడా లోపలే పెట్టేసింది.

★★★★★

సాయంసంధ్య నారింజ రంగు చీరకట్టుకుని, ఎఱ్ఱటి పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని ముస్తాబయినట్టుంది. ఆకాశం, నారింజరంగుతో అస్తమిస్తున్న ఎఱ్ఱటి అందాల సూర్యబింబంతో! హేమంతంలోని చల్లని పిల్లగాలులు వింజామరల్లా విరుస్తున్నాయి. పండక్కి పిల్లలందరూ ముందుగానే అంటే క్రిస్మస్ సెలవులలోనే బయలుదేరి సంక్రాంతి వరకూ వుంటామని ఉత్తరాలు రాశారు. ఈసారి మనమరాళ్లచేత పెద్దపెద్ద ముగ్గులు వెయ్యడం నేర్పించాలి. మన సంప్రదాయం తెలిసేలోగా, అమెరికా నుంచొస్తున్న మనమరాళ్లకీ మనవడికీ చెప్పాలి. అనఘచేత గాలిపటాలెగరేయించాలి. సుచిత్రా, బబితలకి ముగ్గులతోపాటు గొబ్బెళ్లు పెట్టించాలి. గొబ్బెమ్మలంటే ఏమిటో వాళ్లకి చెప్పాలి. అసలు సంక్రాంతి పండగ గురించి వాళ్లకి తెలియజెప్పాలి' అనుకుంటూ దేముడి పటాలకి వెయ్యడానికి చామంతి పూల దండలు అల్లుతూన్న సౌందర్య, పోస్టువాడందించిన ఉత్తరాల కట్టలో పింక్ కవర్‌ని చూసి ఉలిక్కిపడింది. వెంటనే దాన్ని తీసి చింపి చదవడం మొదలెట్టింది.

'ప్రియతమ్మైన లహరీ!'

ఆ సంబోధన చూడగానే అదిరిపోయింది సౌందర్య! ఈ పిలుపు ఒక్క సాగర్ తప్ప ఎవరూ పిలవరే! ఈ దరిద్రుడి కెలా తెలుసు? ఎప్పుడైనా వీడు ఇంట్లో చొరబడి, మా ఇంటి విషయాలన్నీ గమనించలేదు కదా! లేదా ఎవడైనా మా కుటుంబ విషయాలన్నీ తెలిసినవాడై వుంటాడా? ఏమైనా ఛండాలుడులా ఉన్నాడు. స్త్రీలోలుడై వుంటాడు. వయస్సూ, సంస్కారం అన్నీ మర్చిపోయి పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నాడు. వీడికెలాగైనా శాస్తి చెయ్యాలి' అనుకుంటూ కోపంతో ఊగిపోతూ సోఫాలో కూర్చుని ఉత్తరం చదవడం మొదలెట్టింది సౌందర్య.

'నాకు తెలుసు లహరీ! నీకు కోపం వొస్తుందని ఇలా పిలిచినందుకు నీ భర్తకు తప్ప అలా పిలిచే అధికారం ఇంకెవ్వరికీ లేదని నాకు తెలుసు. అయితే నీ భర్తని కాకున్నా ప్రేమలో అతనికి ఏమాత్రం నేను తీసిపోను. అదృష్టవంతుడు, అతడు నీకు భర్త కాగలిగాడు. నేను ప్రేమ పూజారిగానే మిగిలిపోయాను. ఒక్కసారి తనివితీరా నీ నవ్వులు వినాలనీ, దివ్య జ్యోతిలా వెలిగిపోయే నీ ముఖారవిందాన్ని చూడాలనీ, కోరుకోవడం తప్పా? ఎంత సేపూ మీ ఆడవాళ్లు ఇలాంటి విషయాలని నిజమని తెలిసినా, అవునని ఒప్పుకోవడం మీ పతివ్రతా లక్షణానికి విరుద్ధమని భయపడి మనస్సును అదిమిపెట్టి బతుకుతారు. మిమ్మల్ని మీరు ఆత్మవంచన చేసుకుంటారు. నేను నిన్నేమీ నాతో లేచిపొమ్మని కోరడం లేదే! లేదా కనీసం నాతో ఒక్క రోజైనా గడపమని అడగడం లేదే! ఒక్కసారి కనిపించి, కాస్సేపు నా కష్టసుఖాలు తెలుసుకుని, నా మనస్సుని కుదుటపరచమని ప్రాధేయపడ్డా! అది తప్పా? నీ భర్త



## తెలుసుకోండి

1. మదర్ థెరిసా అసలు పేరు ఏంటి
- *Agnes Gouxna Bojaxhiu*

2. ప్రపంచ జనాభా నిమిషానికెంత పెరుగుతున్నది?
- సుమారు170 చొప్పున.

3. మనదేశంలో క్రీడాసామాను తయారీకి ప్రసిద్ధి గాంచిన నగరం ఏది?
- జలంధర్

4. ఏ దేశం అధికంగా నాస్తికదేశం
- అల్బేనియా

5. 'పవర్ హౌస్ ఆఫ్ ది సెల్' అని కణంలోని ఏ భాగంను అంటారు.
- 'మైటోకాండ్రియా' ను

6. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎప్పుడు జన్మించారు? ఎక్కడ?
- సెప్టెంబరు 5న, మద్రాసు దగ్గరలోని 'తిరుత్తణి' గ్రామములో 1888లో జన్మించారు.

అంత అనుమానపరుడా? సంస్కారహీనుడా! లహరీ! నీతో ఒక్కసారి మాట్లాడకపోతే ప్రాణాలు పోతాయేమోనన్నంత తపన! మనశ్శాంతి కరువై జీవచ్ఛవంలా బ్రతుకుతూన్న ఈదీ నుడి మీద ప్రేమ కలగకపోయినా జాలితోనైనా ఒక్కసారి కనిపించు. మీ పిల్లలు అమెరికా నుంచి రాకముందే, నీ కభ్యంతరం లేకపోతే క్రిస్మస్ ముందే డిశంబరు ఇరవయ్యో తేదీకల్లా సాయంత్రం ఆరు గంటలకి, ట్యాంకుబండు మీదున్న భక్తపోతన్న స్టాట్యూ ముందు నువ్వు ఎప్పుడూ కట్టుకునే చిలకపచ్చరంగు ఎఱ్ఱంచు కంచిపట్టు చీరకట్టుకుని రా! అదే నాకు చాలా నచ్చిన చీర! అదిసరే మరి నువ్వు నన్నెలా గుర్తుపడతావు? నేను ఎఱ్ఱంచు పొందూరు ఖద్దరు పంచెకట్టుకుని, అదే రంగు కండువా భుజం మీద వేసుకుంటాను. చేతిలో ఎఱ్ఱ గులాబీ పువ్వు పట్టుకుంటాను. నీకేసి చూసి చిన్నగా నవ్వుతాను. సరేనా? నువ్వు మాత్రం మూగిగా కూర్చో కూడదు. సన్నాయిలా పలికే నీ మధురస్వరంలో నీ మాటలు వినాలి!

నీ కోసం డిశంబరు ఇరవయ్యో తారీకునాడు సాయంత్రం అయిదు గంటలకు నీకోసం ఎదురు చూస్తూ వుంటాను. నువ్వు రాలేదనుకో ఎదురుగుండా కనిపించే సాగర్ అదే హుస్సేనుసాగర్‌లో దూకి ఛస్తాను. వస్తావుకదూ!

- ప్రేమ తపస్వి'

ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి, సౌందర్యకి ఒళ్లంతా చెమటలు పట్టాయి. ఎవరో తనని ప్రతీరోజూ వెంటాడుతూన్నట్టు, తను ఏఏ రంగుల చీరలు కట్టుకుంటూన్నదీ, తను ఏమేం చేస్తూన్నదీ అంతా పసికడుతూన్నట్టున్నాడు, అనుకునేసరికి, కళ్లు తిరిగినట్టై సోఫాలో కూలబడిపోయింది. ఇలాంటిది ఎవరికైనా ఏ పదహారో ఏట్లైనా జరగొచ్చేమోకానీ, యాభయ్యోపడిలో జరగడం ఆశ్చర్యమనిపించింది! భయంతో గుండె వేగంగా కొట్టుకుంది. పోనీ గదా అనిగానీ, అసలు వాడెవడో తెలుసుకుందామనిగానీ వెళితే ఏం జరుగుతుందో, సాగర్‌కి తెలిస్తే ఎలా రియాక్టవుతాడో భయమేసింది. చెప్పకపోతే వాడు నిజంగా హుస్సేన్ సాగర్‌లో దూకి ఛస్తే తను జీవితాంతం దోషిగా చెప్పుకోలేని బాధతో హంతకురాలిగా మిగిలిపోతుంది. ఏం చెయ్యాలో తెలీక ఈ సంగతి సాగర్‌కి చెప్పెయ్యాలనుకుంది. కానీ సాగర్ ఎంతమంచివాడో అంత కోపగొండి కూడా. ఒకవేళ అతనితో పేచిపడి, మాట మాటా పెంచుకుని గొడవపడినా చెయ్యి చేసుకున్నా రభసైపోతుంది. ఎలా? తెగని ఆలోచనలతో సతమతమయిపోయింది సౌందర్య.

ఆరోజు రాత్రి నిద్రపట్టక, పక్క మీద అటూ ఇటూ దొర్లుతూ నిమిషానికొక్కసారి వెళ్లి మంచినీళ్లు తాగుతూ పిచ్చిదానిలా వుంది సౌందర్య. "లహరీ!" ఏమిటి నిద్రపోకుండా అలా దిగాలుగా వున్నావ్. ఇరవైఅయిదున పిల్లలొస్తున్నారు. నీ కోరిక తీరుతుంది. అయినా ఇంకా ఎందుకు ఆరాటం! అయినా లహరీ! ఈ వయస్సులో దేని గురించీ పెద్దగా ఆలోచించడం బెంగపెట్టుకోవడం చెయ్యకూడదు. అయినా నీకేం లోటుందని? ఎందుకలా వున్నావ్?" అడిగాడు సౌందర్య గడ్డం పట్టుకుని. గారంగా బుగ్గని ముద్దెట్టుకుంటూ సాగర్!

సౌందర్య మెదడులో ఆలోచన మెరుపులా మెరిసింది. అతనికి మరింత దగ్గరగా జరిగి "ఏమండీ! మన పక్కింటి సుగుణమణి లేదూ ఆవిడకి ఎవరో దుర్మార్గుడు ప్రేమలేఖలు రాస్తున్నాట్ట. ఈ వయస్సులో అవి చూసి సిగ్గుతో ఎవరికీ చెప్పుకోలేక ఛస్తోంది. పైగా ఈ మధ్యనే రాసిన ఉత్తరంలో డిశంబరు ఇరవయ్యో తేదీ సాయంత్రం ట్యాంకుబండు మీద భక్తపోతన్న విగ్రహం దగ్గర తనని కలుసుకుని ఒక్కసారి మాట్లాడకపోతే, హుస్సేన్ సాగర్‌లో దూకి ఛస్తానని రాసేట్ట! అంది అతనికి దగ్గరగా జరుగుతూ.

"అలాగా! మరేం చేస్తుందట ఆవిడ! ఎవడో బరితెగించినవాడిలా వున్నాడే వెధవ" అన్నాడు సాగర్.

"అవును. అలాంటి వెధవలే ఆ పస్లు చేస్తారు" అంది ధైర్యంగా అతని మొహంలోకి చూస్తూ.

"నువ్వేం సలహా ఇచ్చావ్?" అడిగాడు సాగర్.

"ఛస్తే చావనీ! నువ్వేం మాట్లాడకు! వెళ్లకు! అన్నాను" అంది సౌందర్య.

"అవును చావనీ! కానీ చచ్చే ముందు నా చావుకు ఫలానా కారణమని ఉత్తరం రాసి ఏ పోలీసువాళ్లకో ఇచ్చి ఛస్తే?" ఉలిక్కిపడింది సౌందర్య. "అవును నిజమేనండీ! మరేం చెయ్యమంటారు. కాస్త మీరు సలహా ఇవ్వకూడదూ. ఆ మాటే ఆమెకి చెప్తాను" అంది.

"అతను కోరిన విధంగానే వెళ్లమను. నేను అక్కడక్కడే వుండి కనిపెట్టుకుంటాను. ఏదైనా గొడవ జరుగుతున్నట్టు అనుమానం కలిగితే పోలీసులని పిల్చుకొస్తాను." అన్నాడు సాగర్. "హమ్మయ్య" అని నిట్టూర్చి హాయిగా నిద్రలోకి జారుకుంది సౌందర్య.

సిగ్గుతో ముకుళించుకుపోయి, ముడుచుకుని, చీర కొంగు భుజాలనిండా కప్పుకుని కూర్చుంది, పోతన్న విగ్రహం దగ్గర సౌందర్య బిత్తర చూపులు చూస్తూ! క్షణమొక యుగంలా గడుస్తోంది. చెమటలు పోస్తున్నయ్. వచ్చేపోయే వాహనాలూ, జనసమూహం, నరకంలా కనిపించింది సౌందర్యకి. ఎదురుగ్గా వున్న బిర్లామందిరంలోకి వెంకటేశ్వరాలయాన్ని చూస్తూ 'కౌసల్యాసుప్రజారామ పూర్వా సంధ్యా ప్రవర్తతే' అని జపించుకుంటూ ఈ గండం గడిచేలా చూడమని తను తన భర్తకంట్లో పడకుండా గబగబా ఆ దుర్మార్గుణ్ణి కలిసి చెడామడా చీవాట్లు పెట్టి వెళ్లిపోయేలా చేసి రక్షించమని మొక్కుకుంటూ కూర్చుంది. ఉన్నట్టుండి వెనక

# బలభద్రపాత్రుని రమణి

కలం నుంచి

# అందమైన నిశ్శబ్దం



సరికొత్త సీరియల్

త్వరలో


నుంచి ఎవరో భుజాల మీద చేతులు వేసేసరికి ఉలిక్కిపడి కెవ్వున అరవబోయింది. చేతిలో ఎఱ్ఱ గులాబీని చూసింది. వాడే! ఎంతపని చేశాడు? అని పళ్లతో అతని అరచేతిని కొరికింది. 'బాబోయ్! అంటూ అతను పట్టువిడిచాడు. గిర్రున వెనక్కి తిరిగి, చెళ్లున కొట్టడానికి చెయ్యెత్తింది. ఆ చెయ్యి కిందకి దిగలేదు. కళ్లు మూతపడలేదు. నోరు తెరుచుకుంది. ఒక్క క్షణం ప్రపంచమంతా ఆగిపోయినట్టయింది. అతను నవ్వుతున్నాడు. ఆమెకి ఏడుపొచ్చింది. కన్నీళ్లు చెంపల మీదుగా జలజలా రాలాయి. అతడు గట్టిగా ఎవ్వరూ చూడడంలేదని గమనించి కౌగిలించుకున్నాడు. మూగబోయిన ఆమె గొంతు సన్నగా పలికింది. "ఏమిటండీ ఇది? ఎందుకిలా చేశారు? నన్ను ఈ వయస్సులో పరీక్షించాలనా? నా మీద ఇన్నేళ్ల తరవాత అనుమానం వచ్చిందా?" వెక్కి వెక్కి ఏడుస్తున్న సౌందర్యని మెల్లగా నడిపించి, పోతన విగ్రహం దగ్గర మెట్టు మీద కూర్చోబెట్టాడు సాగర్.

"లహరీ! ఊరికే తమాషాగా ఒక ఆట పట్టిద్దామనుకున్నాను!"

"ఎందుకండీ ఈ వయస్సులో ఇలాంటి ఆటలు! నా గుండె ఆగిపోయింది." కన్నీళ్లు పెట్టుకుంది.

"ఓహో... సౌందర్యా! జీవితంలో థ్రిల్ చాలా అవసరం. ఏ సమస్యలూ లేకుండా, ఏ ప్రత్యేక పనుల్లా లేకుండా రొటీన్‌గా సాగిపోతే బాగుండదు. నాకు రావలసిన బిరుదులూ కావలసిన డబ్బూ అంతా వచ్చేసింది. నీకూ ఏదీ లేదన్న కొరత లేదు. మరి ఏం చెయ్యాలి?"

"అందుకనీ నన్నేడిపిస్తారా?" మూతి ముడుచుకుంది సౌందర్యలహరి!

"లహరీ! నీకు ప్రేమలేఖలు రాసిన తృప్తి కూడా ఇప్పుడు నాకు కలిగింది. మనది పెద్దలు చేసిన పెళ్లి! ఏనాడూ మనం విడిగా వుండలేదు. నువ్వు పుట్టింటికెళితే కచ్చేరీలు మీ వూళ్లో పెట్టించుకుని నేనూ మీ వూళ్లోనే నీతోనే వుండేవాడిని! ఆ కోరికా ఇప్పుడు తీరిపోయింది. నాకు తెలుసు ఆ పింక్ కవర్ చూడగానే నీకు భయం పుడుతోందని. కానీ, ఆ భయం తీరే సమయంలో నీలో కలిగే ఆనందం కళ్లారా చూసి, ఆ థ్రిల్ అనుభవించాలని అనుకున్నాను. నీకు మాత్రం ఇప్పుడు ఆనందంగా లేదూ?" చిలిపిగా కన్నుకొడుతూ నవ్వుతూ అన్నాడు సాగర్! గట్టిగా నవ్వకండి. కట్టుడు పళ్లు ఊడిపోతాయ్" వెక్కిరించింది సౌందర్య జుట్టు ముడి సవరించుకుంటూ. "సరే! నీ జుట్టు ముడి జాగ్రత్త. గట్టిగా పట్టుకుంటే సవరం చేతిలోకొస్తుంది" అన్నాడు సాగర్. ఇద్దరూ తనివితీరా నవ్వుకున్నారు. ట్యాంకుబండు స్వర్గంలా కనిపించింది సౌందర్యకి. ఆకాశంలోని నక్షత్రాలు తమని చూసి నవ్వుతూన్నట్టనిపించింది. చందమామ వీళ్లని చూసి మబ్బుల్లో దాక్కున్నాడు. "ఇకపోదాం పద! హేప్పీ క్రిస్టమస్ అండ్ హేప్పీ సంక్రాంతి విష్ యూ." నవ్వేడు సాగర్. "బైదిబై హేప్పీ న్యూయియర్. ఈ థ్రిల్ ఈ సంవత్సరమంతటికీ చాలు" అన్నాడు.

"సర్లెండి. సేమ్ టుయూ..." అంది కొంటెగా.

జీవితానికి సరిపడ సంబరాన్ని మూటగట్టుకుని బయల్దేరారు సాగర్, సౌందర్యలు!

తెల్లటి మారుతీవ్యాను ట్యాంకుబండ్ మీద నుంచి, హౌస్ నెంబరు పది, రోడ్ నెంబరు పన్నెండు బంజారా హిల్స్ గేటులోకి, ఇరు పక్కలా వున్న అశోకా చెట్లనీ గులాబీ తోట్లనీ దాటుకుంటూ! వాచ్‌మన్ పెట్టే నమస్కారాలందుకుంటూ తలుపు తీసి లోపలికెళ్లగానే బట్టలకింద దాచిన పింక్ కవర్లని చూసి నవ్వుకుంటూ సౌందర్యని చూసి ఇదే సౌందర్య లహరి థ్రిల్ అంటే! తెలిసిందా? వేళాకోళం చేశాడు సాగర్.

"తెలిసింది స్వరగంధర్వ మోహన మురళీసాగర్‌గారూ..." ప్రతి అక్షరాన్నీ నొక్కి పలుకుతూ అంది సౌందర్య.

ఇద్దరి వయస్సూ ఒక్కసారిగా పదహారేళ్లుగా మారిపోయింది!

థ్రిల్!...